# మిర్చియార్డ్ హంగామా



సంక్రాంతిని టార్గెట్ చేసుకుని శరవే గంగా షూటింగ్ జరుపుకుంటున్నది మహేశ్, త్రివిక్రమ్‌ల 'గుంటూరుకారం' సినిమా. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ హైదరాబాద్ ఆర్ఎఫ్‌సీలో ప్రత్యేకంగా వేసిన గుంటూరు మిర్చి యార్డ్ సెట్‌లో జరుగుతున్నది. ఈ సెట్‌లో శేఖర్ మాస్టర్ నృత్య దర్శకత్వంలో ఓ మాస్ గీతాన్ని దర్శకుడు త్రివిక్రమ్ తెరకెక్కిస్తున్నారు. మహేశ్‌బాబుతో పాటు ఇతర తారాగణం కూడా ఈ పాటలో పాల్గొంటున్నది. 'గుంటూరు కారం' మహేశ్ కంటే త్రివిక్రమ్‌కి చాలా ఇంపార్టెంట్ మూవీ. ఎందుకంటే ఈ సినిమా తర్వాత మహేశ్ ఎలాగూ రాజమౌళి దర్శకత్వంలో నటిస్తారు. రెండు భాగాలుగా తెరకెక్కనున్న ఆ సినిమాతో మహేశ్ పాన్ వరల్డ్ హీరోగా రూపాంతరం చెందడం ఖాయమని అభిమానులు భావిస్తున్నారు. ఇక త్రివిక్రమ్ 'గుంటూరుకారం' తర్వాత అల్లు అర్జున్‌తో సినిమా చేయబోతున్నారు. తను ఇప్పటికే 'పుష్ప'తో పాన్ ఇండియా హీరోగా అవతరించాడు. అల్లు అర్జున్ చిత్రం అంటే పాన్ ఇండియా స్థాయిలో విడుదల అవ్వడం కామన్. మరి అలాంటప్పుడు త్రివిక్రమ్ మేకింగ్‌లో యూనివర్సల్ అప్పీల్ అవసరం. దానికి 'గుంటూరుకారం' చిత్రమే నాందిగా నిలవాలి. అందుకే పట్టుదలతో ఈ సినిమాను తెరకెక్కిస్తున్నారు త్రివిక్రమ్. హారిక అండ్ హాసిని క్రియేషన్స్ సంస్థ నిర్మిస్తున్న ఈ చిత్రంలో శ్రీలీల, మీనాక్షి చౌదరి కథానాయికలుగా నటిస్తున్న విషయం తెలిసిందే.

# బాలీవుడ్‌కు గుడ్‌బై



హిందీ చిత్రసీమలో ఒకప్పుడు అగ్ర కథానాయికగా రాణించింది ప్రియాంక చోప్రా. నిక్ జోనస్‌తో వివాహానంతరం లాస్‌ఏంజిల్స్‌కు మకాం మార్చి హాలీవుడ్‌లో కూడా గుర్తింపును సంపాదించుకుంది. అభిమానులు ఈ భామను గ్లోబల్ స్టార్ అంటూ అభివర్ణిస్తారు. గత కొంత కాలంగా హాలీవుడ్ సినిమాలు, వెబ్‌సిరీస్‌లకే ప్రాధాన్యతనిస్తున్నది ప్రియాంక చోప్రా. భవిష్యత్తులో ఈ అమ్మడు హిందీ పరిశ్రమకు గుడ్‌బై చెప్పనుందని ముంబయి సినీ వర్గాల్లో వినిపిస్తున్నది. ఈ వార్తలకు బలం చేకూర్చేలా ముంబయిలోని తన ఆస్తులను వరుసగా అమ్మకానికి పెడుతున్నది ప్రియాంక. తాను ఎంతో ఇష్టపడి డిజైన్ చేసుకున్న అంధేరిలోని ఖరీదైన ప్లాట్‌ను కూడా ఇటీవలే పదికోట్లకు విక్రయించింది. అలాగే ఓ కమర్షియల్ ప్రాపర్టీని కూడా అమ్మేసిందట. ఈ నేపథ్యంలో ప్రియాంక చోప్రా హిందీ చిత్రసీమకు దూరం కాబోతున్నదనే ప్రచారం జరుగుతున్నది. హాలీవుడ్‌లో వరుసగా భారీ ఆఫర్స్ రావడం.. హిందీ ఇండస్ట్రీలో అంతగా అవకాశాలు లేకపోవడంతో లాస్‌ఏంజిల్స్ కేంద్రంగానే కెరీర్‌ను కొనసాగించాలనే నిర్ణయానికి వచ్చిందని చెబుతున్నారు. ప్రస్తుతం ప్రియాంక చోప్రా 'హెడ్స్ ఆఫ్ స్టేట్' అనే హాలీవుడ్ చిత్రంలో నటిస్తున్నది.







# ఎన్టీఆర్‌తో జోడీగా..



యష్‌రాజ్ ఫిలింస్ బ్లాక్‌బస్టర్ 'వార్'కి సీక్వెల్‌గా 'వార్ -2' రానున్న విషయం తెలిసిందే. హృతిక్ రోషన్, ఎన్టీఆర్ కథానాయకులుగా నటిస్తున్నారు. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ విదేశాల్లో శరవేగంగా జరుగుతున్నది. ఆయాన్ ముఖర్జీ దర్శకుడు. హృతిక్ రోషన్‌పై కీలక సన్నివేశాలను చిత్రీకరిస్తున్నారు. ఇదిలావుంటే, పార్ట్ వన్‌లో హృతిక్‌ని ఢీకొనే పాత్రను టైగర్ ష్రాఫ్ చేస్తే, ఈ రెండో పార్ట్‌లో ఆ బాధ్యతను ఎన్టీఆర్ తీసుకున్నారు. ఇందులో ఎన్టీఆర్ పాత్ర అత్యంత శక్తిమంతంగా దర్శకుడు డిజైన్ చేసినట్టు విశ్వసనీయ సమాచారం. జనవరి నుంచి తారక్ ఈ సినిమా షూటింగ్‌లో పాల్గొంటారు. విరామం లేకుండా మూడు నెలల పాటు ఈ సినిమా షూటింగ్‌లోనే ఎన్టీఆర్ ఉంటారు. అంతేకాదు ఇందులో ఆయన సరసన హీరోయిన్‌ని కూడా దర్శకుడు ఖరారు చేశారు. 'బంటీ ఔర్ బబ్లీ -2'తో వెండితెరకు పరిచయమై, డెబ్యూ ఆఫ్ ది ఇయర్‌గా ఐఫా అవార్డు సొంతం చేసుకున్న శార్వరీ వాఘ్‌ని ఎన్టీయార్‌కి జోడీగా ఎంపిక చేసినట్టు సమాచారం. అంతేకాదు, ప్రత్యేక పాత్రల్లో దీపికా పడుకోన్, అలియాభట్ కూడా నటిస్తున్నట్టు తెలిసింది. ఈ పాన్ ఇండియా యుగంలో దక్షిణాది నుంచి తారక్‌నీ, ఉత్తరాది నుంచి హృతిక్‌నీ కలిపి యష్‌రాజ్ ఫిలింస్ బాక్సాఫీస్‌పై చేస్తున్న ఈ 'వార్' ప్రపంచవ్యాప్తంగా సంచలనం సృష్టించడం ఖాయమని అభిమానులు అభిప్రాయపడుతున్నారు.

# ఆర్థిక నేరాల కథాంశంతో..



సత్యదేవ్, డాలీ ధనుంజయ కథానాయకులుగా నటిస్తున్న తాజా చిత్రం 'జీబ్రా'. 'లవ్ ఫేవర్స్ ది బ్రేవ్' ఉపశీర్షిక. ఈశ్వర్ కార్తీక్ దర్శకుడు. ప్రియా భవాని శంకర్, జెన్నిఫర్ కథానాయికలు. ఈ సినిమా చిత్రీకరణ పూర్తయింది. దర్శకుడు చిత్ర విశేషాలు తెలియజేస్తూ 'ఆర్థిక నేరాల నేపథ్యంలో యథార్థ ఘటనల స్ఫూర్తితో ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నాం. క్రైమ్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా మెప్పిస్తుంది. తెలుగు, కన్నడ, తమిళం, మలయాళ, హిందీ భాషల్లో విడుదల చేయబోతున్నాం' అన్నారు. సత్యరాజ్, సునీల్, గరుడ రామ్, రామరాజు తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: సత్య పొన్మార్, సంగీతం: రవి బస్రూర్, నిర్మాతలు: ఎస్ఎన్ రెడ్డి, ఎస్.పద్మజ, బాల సుందరం, దినేష్ సుందరం, రచన-దర్శకత్వం: ఈశ్వర్ కార్తీక్.

# 'విశ్వంభర'లో సునీల్?



'పుష్ప' చిత్రంలో ప్రతినాయకుడి పాత్రలో మెప్పించారు సునీల్. ఆ సినిమా తర్వాత తన పంథా మార్చుకొని విభిన్నమైన పాత్రలను ఎంచుకుంటున్నారు. ఇటీవల విడుదలైన 'జపాన్' చిత్రంలో కూడా సునీల్ సరికొత్త క్యారెక్టర్‌లో కనిపించారు. తాజా సమాచారం ప్రకారం అగ్ర హీరో చిరంజీవి నటిస్తున్న తాజా చిత్రం 'విశ్వంభర'లో (టైటిల్ పరిశీలనలో ఉంది) సునీల్ కీలకమైన పాత్రలో కనిపించనున్నారని తెలిసింది. చిరంజీవి నటించిన ఇంద్ర, స్టాలిన్, అందరివాడు, జై చిరంజీవా, గాడ్ ఫాదర్ వంటి చిత్రాల్లో సునీల్ కీలకమైన పాత్రల్లో నటించి మెప్పించిన విషయం తెలిసిందే. ఈ సెంటిమెంట్ దృష్ట్యా 'విశ్వంభర' చిత్రంలో కూడా సునీల్ కోసం దర్శకుడు వశిష్ట మంచి పాత్రను డిజైన్ చేశారని చెబుతున్నారు. సోషియో ఫాంటసీ కథాంశంతో తెరకెక్కబోతున్న 'విశ్వంభర' రెగ్యులర్ షూటింగ్ ఈ నెల 25 నుంచి హైదరాబాద్‌లో మొదలుకానుంది. యూవీ క్రియేషన్స్ సంస్థ భారీ స్థాయిలో ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నది.




